# ఒక మరణం - ఒకచావు

డి. వెంకట్రామయ్య

మంత్రిగారి బామ్మగారు మరణించారు. సరిగ్గా రాత్రి తొమ్మిదిన్నరకి యిహలోకయాత్ర చాలించి పరలోకానికి ప్రయాణంకట్టారు. సమయానికి మంత్రిగారు ఊళ్ళోలేరు. తమ బామ్మగారికి రోజులు దగ్గరకొచ్చాయని తెలుసుకున్నవారైనప్పటికిన్నీ. ప్రజాసేవయే పరమధర్మంగా యెంచుకున్నవారుగనుక ఆరోజు ఉదయమే ఊరికెళ్లారు.

అక్కడకి యాభైమైళ్ళదూరానవున్న ఒకానొక పట్టణంలో, ఆస్పత్రికట్టాల్సిన స్థలంలో ఆస్పత్రి కట్టనివ్వకుండా, ప్రజలకి యితోధికమైన సేవచేసే సదుద్దేశ్యంతో- 'ఎయిర్‌కండిషన్డ్ మరియూ బార్ ఎటాచ్డ్' హోటల్ నిర్మించాడొక పుణ్యాత్ముడు. 'ఆ పుణ్యాత్ముడు మరెవరోకాదు, మన మంత్రిగారి మేనమామకొడుకే' నంటూంటారు కొందరు పాపాత్ములు. ఆ విషయం మనకప్రస్తుతం. సరే, సదరు హోటలుకి ప్రారంభోత్సవం చెయ్యవలసిందని, మన మంత్రిగారిని 'కోరినవెంటనే' 'దయతో అంగీకరించి'- అతిముఖ్యమైన రాచకార్యాలన్నీ పక్కకునెట్టి, మరణశయ్యమీదనున్న బామ్మగారినికూడ విడిచిపెట్టి పొద్దున్నే బయల్దేరి అక్కడికెళ్ళిపోయారు.

మంత్రిగారి బామ్మగారి వయసు తొంభైనాలుగు సంవత్సరాలు. అంతపిన్న వయసులోనే ఆమె అకాలమరణం చెందినందుగ్గాను- మంత్రిగారి బంధుమిత్రులూ అనుచరులూ సహచరులూ యింకా చాలామందీ మంత్రిగారింటికెళ్ళి భోరున ఏడ్చారు. మరికొంతమంది మంత్రిగారొచ్చాక ఏడవొచ్చులే, యిప్పట్నించీ ఎందుకువేస్టనీ, అతికష్టమ్మీద ఏడుపు ఆపుక్కూచున్నారు.

మంత్రిగారికి అరడజను ట్రంక్‌కాల్సు. డజను టెలిగ్రామ్సువెళ్లాయి. పురప్రముఖులుకొందరు కార్డుపంపారు. కొందరు స్వయంగా మంత్రిగారికెదురెళ్లారు.

ఇతరమంత్రులయిళ్ళకీ, ముఖ్యమంత్రిగారింటికీ, గవర్నర్‌గారింటికీ, శాసనసభ్యులయిళ్ళకీ, న్యాయమూర్తులయిళ్ళకీ, ఉన్నతాధికారులయిళ్ళకీ, పురప్రముఖుల

యిళ్ళకీ వర్తమానాలువెళ్లాయి. అంతా హడావిడిగా బయల్దేరి వచ్చేశారు. కొందరు పెద్దలువటుకు మంత్రిగారొచ్చాక కబురుచెయ్యమన్నారు. జనం విపరీతంగావచ్చారు. పత్రికా విలేఖరులొచ్చారు. ఫోటోగ్రాఫర్లొచ్చారు. పోలీసువాళ్లొచ్చారు. సినిమా స్టార్లొచ్చారు. మంత్రిగారి యిల్లు కిటకిటలాడిపోయింది.

కొందరు—కాలుగాలిన పిల్లుల్లా, నిప్పుతొక్కిన కోతుల్లా యింట్లోంచి బయటికీ బయటినుంచి యింట్లోకీ పరుగులెత్తుతున్నారు. ఒక్కరొక్కరుగా విచ్చేస్తున్న పెద్దలకి స్వాగతాలుచెప్పి లోపలికి తీసుకెళ్తున్నారు. కొందరు—వచ్చిన పెద్దలచుట్టూ చేరుతున్నారు. మరికొందరు మంత్రిగారి బామ్మగారి జీవితవిశేషాలు చెప్పుకుని విచారిస్తున్నారు. కొందరు శవానికి సేవలుచేస్తున్నారు. ఈగలూ దోమలూ రాకుండా విసనకర్రలుపుచ్చుకు విసురుతున్నారు. కంపుకొట్టకుండా పన్నీరు చల్లుతున్నారు. అగరువత్తులు వెలిగిస్తున్నారు. కొందరు మంత్రిగారి సతీమణికీ, పిల్లలకీ విసురుతున్నారు. ఫాన్‌గాలికి ఉక్కిరిబిక్కిరైపోతారని విసనకర్రలుపుచ్చుకుని అతిజాగ్రత్తగా అతిమెల్లగా విసురుతున్నారు. కొందరు కళ్లతుడుచుకుంటున్నారు; కొందరు ముక్కులుచీదుతున్నారు. ఓదార్చుదామంటే మంత్రిగారి సతీమణిగాని, పిల్లలుగాని ఏడవటంలేదు. తలోకుర్చీలోనూ సీరియస్‌గా కూర్చున్నారు.

అర్ధరాత్రి పన్నెండున్నరకి—ముందు నాలుగుకార్లూ వెనక నాలుగుకార్లూ తోడు రాగా— మధ్యనున్నకారులో మంత్రిగారు విచ్చేశారు. కారుతలుపు స్వంతచేతుల్తోతెరిచే సౌభాగ్యంకోసమూ, మంత్రిగారికి మొట్టమొదట సానుభూతి తెలియపర్చే మహదవకాశంకోసమూ, మంత్రిగారు లేకపోయినా ఏలోటూలేకుండా తామెటువంటి ఏర్పాట్లు చేశారో విన్నవించుకోడంకోసమూ— చాలమంది కారుమీదికెగబడ్డారు. లోపలున్నవాళ్లు కూడ పరుగెత్తుకొచ్చి కారుచుట్టూమూగారు. పోలీసులు జోక్యంకలగజేసుకుంటేగాని మంత్రిగారు లోపలికెళ్ళడానికి వీలైందికాదు

మంత్రిగారు యింట్లోకిరాగానే చాలమంది ఏడవటం మొదలెట్టారు. మంత్రిగారు మౌనంగావెళ్లి బామ్మగారి శవంపక్కన కూచున్నారు. ఉలకలేదు; పలకలేదు; పరమసీరియస్‌గా శవాన్నిచూస్తూ కూచున్నారు. ఆయనా ఏడవకపోయేసరికి ఓదార్చుదామని కూర్చున్నవాళ్ళకి మరోసారి ఆశాభంగం కలిగింది.

పెద్దలొక్కరొక్కరూ మంత్రిగారిదగ్గరకొచ్చి తమ తీవ్రసంతాపాన్నీ, ప్రగాఢసానుభూతినీ వ్యక్తపర్చి శెలవుతీసుకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత మంత్రిగారు తమ

976

ఆంతరంగికులైనవారితో కొద్దిసేపుముచ్చటించి, రేపటి అంత్యక్రియల ఏర్పాట్లగురించి ఆదేశాలిచ్చి, మేడమీదికెళ్ళిపోయారు.

సరిగ్గా అదేసమయాన–మంత్రిగారింటికి రెండుఫర్లాంగులదూరాన-ఒకగుడిసెలో-

కిరసనాయిల్‌దీపం గుడ్డివెలుగులో– దిక్కూ మొక్కూ, డబ్బూ దస్కం ఏమీలేని అభాగ్యుడొకడు– అనామకుడొకడు– పాతికేళ్ళభార్యశవాన్ని ముందెట్టుకూర్చున్నాడు.

అతని భార్యకి తిండిలేక రోగమొచ్చింది. డబ్బులేక చచ్చిపోయింది.

వారంరోజులు నరకయాతన లనుభవించి అంతకి గంటక్రితమే కన్నుమూసింది.

ఏం చెయ్యాలో అతగాడికేం తోచడంలేదు. కాళ్ళూచేతులూ ఆడ్డంలేదు. బంధువుల్లేరు; స్నేహితుల్లేరు; శవాన్ని తగలెయ్యడానిక్కూడా డబ్బుల్లేవు; కళ్ళనిండా నీళ్లు మాత్రమున్నాయి. డొక్కనిండా, గుండెనిండా చిరుగులు మాత్రమున్నాయి.

అతనిపేరూ ఊరూ అనవసరం! మహామహా మంత్రిగారిపేరే మనం చెప్పుకోవటంలేదే- ఆ అనామకుడి పేరెందుకు? అనామకుడనే అందాం.

* * *

తెల్లవారింది.

మంత్రిగారింట్లో మంత్రిగారూ ఆయన భార్యాపిల్లలూ ఏమోగాని– మంత్రిగారి భక్తబంధుజనం మటుకు తెల్లార్లూ శవజాగరణ చేశారు పాపం. మంత్రిగారి బామ్మగారి ఆకస్మిక మరణవార్తని ఆకాశవాణివారు చింతిస్తూ ప్రకటించారు. వార్తాపత్రికల్లో మొదటిపేజీల్లో ప్రముఖంగా ప్రచురించారు.

మంత్రిగారి బామ్మగారి ఫోటోదొరక్క- ఒక పత్రికవారు మంత్రిగారి ఫోటోనే వేసేసి- 'ఫలానా మంత్రిగారిపై పిడుగుపాటు– దేశానికి తీరనిలోటు'– అని శీర్షిక పెట్టారు. మరోపత్రికా సంపాదకుడు– 'ఫలానా మంత్రిగారి పితామహి మరణం' అని శీర్షికపెట్టి ప్రెస్సుకి పంపితే– ప్రెస్సులో అక్షరాలుకూర్చే ఆయనకి ఆవేశమొచ్చి అందులో యింకో అక్షరంకూడా చేర్చేశాడు. చివరికి– 'ఫలానా మంత్రిగారి పితామహిషి మరణం'- అని అచ్చయింది. ఆ పత్రికవారిమీద మంత్రిగారు ఆగ్రహించడం వేరేకథ.

977

ఉదయం తొమ్మిదిగంటలకి బ్రహ్మాండమైన ఊరేగింపుతో శవయాత్ర ప్రారంభమైంది. ఒకలారీలో పెద్దవేదిక నమర్చి దానిమీద శవాన్ని పడుకోపెట్టారు. పక్కనే మంత్రిగారు నిలబడ్డారు. మంత్రిగారి భార్యా బిడ్డలూ, యితర పెద్దలూ లారీకిముందూ వెనకా కార్లలో కూర్చున్నారు.

ఇంకా కార్లూ, మోటార్ సైకిళ్ళూ, సైకిళ్ళూ, రిక్షాలూ చాలాచేరాయి. మంత్రిగారి యింటికి శ్మశానం అరమైలుదూరముంటే, యివన్నీకలిసి మైలుపొడవయ్యాయి.

దారిపొడుగునా— చాలమంది ప్రముఖులూ వ్యాపారసంస్థలవారూ, దుకాణాలవారూ బామ్మగారి 'భౌతికకాయం' మీద పూలమాలలుంచి, శవానికీ మంత్రిగారికీ కూడ నమస్కారాలు చేసి తమతమ భక్తిప్రపత్తులు వెల్లడించుకున్నారు. శ్మశానానికి చేరేటప్పటికి పదకొండైంది. అప్పటికే అక్కడ ఒకపెద్ద చితి అందంగా పేర్చివుంచారు. పైన రెండొందలు గంధపుచెక్కలు కూడా పేర్చారు కలప వ్యాపారస్తుల సంఘంవారు ఒకలారీనిండా మాంఛి ఎండుకట్టెలు పంపారు. నూనెవర్తకుల సంఘంవారు నేతిడబ్బాలు పంపారు.

మంత్రిగారితో పాటు యితర పెద్దలుకూడా కార్లుదిగి చితివరకూ నడిచారు. మిగతాజనాన్ని కాస్త ఎడంగానే పోలీసులాపేశారు. దహనకాండ ప్రారంభమయ్యే ముందు— మంత్రిగారి కుడిభుజ మొకాయన కాస్సేపు ఉపన్యసించాడు. బామ్మగారి గుణగణాల్ని ప్రశంసించి, ఆవిడ మరణం రాష్ట్రానికేకాక, యావద్భారత దేశానికీ, మళ్ళీ మాట్లాడితే యావత్ప్రపంచానికీ ఎంతనష్టమో వివరించాడు.

తనకీ అవకాశం కలిగించినందుకు బామ్మగారికి కృతజ్ఞతలుచెప్పుకుని ఉపన్యాసం విరమించాడు. మంత్రిగారి యెడంభుజంకూడ మాట్లాడదామనుకున్నాడుగాని మంత్రిగారే వద్దని వారించారు.

బామ్మగారి మరణానికి దేవతలు కన్నీరుకారుస్తున్నట్టుగా— సన్నగా చినుకు ప్రారంభమైంది చితిమీద శవాన్ని పడుకోబెట్టారు. జరగవలసిన తతంగమంతా జరిగాక, చితిమీద నెయ్యికుమ్మరించి, నిప్పంటించారు మంత్రిగారు. భగ్గున, నిలువెత్తున మంటలులేచాయి.

సరిగ్గా అదేసమయాన- అదేశ్మశానంలో మరోమూల- అపుల్లా ఈపుల్లా ఏరుకుని, చెత్తా చెదారం పోగుచేసి, భార్యశవాన్ని దహనంచెయ్యడానికి నానాతిప్పలూ పడుతున్నాడు అనామకుడు.

978

చినుకుకాస్త పెద్దదైంది. అంటుకున్ననిప్పు ఆరిపోయింది. ఇంకేంచెయ్యలేక చతికిలబడ్డాడు అనామకుడు. వాళ్ళదగ్గరా వీళ్ళదగ్గిరా అడుక్కున్న పైసలు కాటిసుంకానికే సరిపోయాయి. కట్టెలు కొనడానికి మిగల్లేదు.

తలెత్తి నల్దిక్కులాచూశాడు. ఆమూల- మంత్రిగారి బామ్మగారి చితి యింకా దివిటీ వెలిగినట్టు వెలుగుతూనేవుంది.

ఉన్నట్టుండి ఆకాశంలో నలువైపులా కారుమబ్బులు కమ్ముకొచ్చాయి. మంత్రి గారి బామ్మగారి అంత్యక్రియలుచూడ్డానికొచ్చిన జనమంతా వెళ్ళిపోయారు. బామ్మగారి భౌతికకాయం దాదాపు బూడిదైంది. బూడిదయ్యేదాకా వుంటామన్నవాళ్ళిద్దరూ. కాస్త వెచ్చగా ఏదైనాతాగివద్దామని ఎక్కడికో వెళ్లారు. శ్మశానంలో ఒక్కపురుగుమిగల్లేదు అనామకుడుతప్ప.

అంతా వెళ్ళిపోయాక అనామకుడు మెల్లగాలేచి- భార్యశవం భుజానవేసుకుని, బామ్మగారి చితిదగ్గరకొచ్చాడు శవాన్ని కిందదింపాడు. ఒక్కనిమిషం ఆలోచించాడు. ఆలోచించే వ్యవధిలేదు. పెద్దవర్షం వచ్చేట్టుగావుంది వేరే చితి తయారుచేసిఅంటించా లంటే కష్టం. ఈలోగా యెవరైనారావచ్చు అందుకే వెంటనే తనకర్తవ్యం నిర్ణ యించుకున్నాడు.

విడిగాపడివున్న కట్టెలు కొన్నితీసి చితిలోవేశాడు భార్యశవాన్ని చితిమీదవుంచి మరికొన్ని కట్టెలు వేశాడు. మంటలు మళ్ళీ విలువెత్తునలేచాయ్!

*                    *                    *

కొద్దిరోజులతర్వాత— మంత్రిగారిబామ్మగారి చితాభస్మాన్ని నగరానికి సమీపాన వున్న నదిలో కలపడంకోసం— పెద్దఎత్తున ఏర్పాటైన కార్యక్రమంలో, అనామకుడు కూడ ఆనందంగా పాల్గొన్నాడు.

979